


# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

### నాకు జ్ఞాపకం లేని "ఆ అరవై రోజులు"

2012 ఆగస్టు 31 వ తేదీ రాత్రి ఏడు గంటలవుతూండగా నేను ఒక సమావేశంలో పాల్గొనటానికి ప్రెస్ క్లబ్బుకి వెళ్ళాను. ఇంకా సమావేశం ప్రారంభం కాలేదు హఠాత్తుగా నా మెడ రెండు వైపులా నొప్పి ప్రారంభమైంది. కొద్ది నిమిషాలకే ఆ నొప్పి రెండు కణతలకు ప్రాకింది. నాకు'స్పాండిలైటిస్'వున్న కారణంగా ఆ నొప్పి వచ్చివుంటుదనుకున్నాను. క్షణాల్లో నొప్పి విపరీతమై కళ్లు తిరిగాయి. సమావేశం నించి ఇంటికి వెళ్లిపోతే మంచిదనుకున్నాను. కుర్చీలోంచి లేవబోయాను.

నాకేమీ కనిపించలేదు. స్పృహ కోల్పోతున్నట్లు అనిపించింది. అంతే అలా కుర్చీలోనే కూలిపోయాను తర్వాత ఏం జరిగిందో నాకు తెలీదు. తిరిగి సెప్టెంబరు 20 వ తేదీన నా కుటుంబ సభ్యులతో కేర్ ఆస్పత్రినించి ఇంటికి చేరటం మాత్రమే జ్ఞాపకం వుంది. ఆ మధ్యలో ఇరవై రోజులూ ఏం జరిగిందో నాకు జ్ఞాపకంలేదు.

నా భార్యా, నా పిల్లలూ ఆ ఇరవై రోజులూ ఏం జరిగిందో రాస్తామంటే రాయమన్నాను. వాళ్లు రాసిన ఆ ఇరవై రోజుల వాళ్ల జ్ఞాపకాల్నీ యధాతథంగా మీకు తెలియపరుస్తున్నాను. చదవండి ...

### నాన్న మరిచిపోయిన "ఆ ఇరవై రోజులు"

-జీడిగుంట శ్రీధర్ (రెండవ కుమారుడు)

**ఆగస్టు** 31 శుక్రవారం రాత్రి 7.30 నిమిషాలు .. నేను, మా అబ్బాయి తేజ, మా అమ్మాయి పూజ, నా భార్య రామలక్ష్మి–మేం ముగ్గురం కంప్యూటర్లో పూజ బి. టెక్ అడ్మిషన్ కి సంబంధించి, ఏ కాలేజీ బాగుంటుందోనని 'ఆప్షన్స్' చూస్తున్నాం.

అంతలో నా సెల్ ఫోన్ మోగింది. ఆన్ చేసి 'హాలో' అన్నాను. అవతలనించి "ప్రెస్ క్లబ్ నుంచి వేణుగోపాల్ ని మాట్లాడుతున్నాను. మీ నాన్నగారు సడన్ గా' కొలాప్స్' అయి స్పృహ కోల్పోయారు. గ్లోబల్ ఆస్పత్రికి తీసుకెడతాం! అక్కడికి వచ్చేయండి!" అన్నారు.

నేను షాకయ్యాను. "గ్లోబల్ కి కాదు. బంజారాహిల్స్ లో వున్న కేర్ కి తీసుకురండి. నేను అక్కడికి వచ్చేస్తున్నాను" అని ఫోన్ పెట్టేసి, మా అమ్మకి చెప్పకుండా, తేజని తీసుకుని నా బండిమీద బయల్దేరాను.

నేను కేర్ ఎమర్జెన్సీ దగ్గరకు వెళ్ళేసరికి–నాన్న కారు కూడా వచ్చింది. మా డ్రైవర్ హాసన్ డోరు తెరిచి, నాన్నని దింపే ప్రయత్నం చేస్తున్నాడు. నాన్న దిగలేకపోతున్నారు.

వెంటనే వీల్ చైర్ ఏర్పాటు చేశాం. అందులో కూర్చోబెట్టి క్యాజువాలిటీ వార్డుకి తీసుకెళ్ళాం. కేర్ లో నాకు తెలిసిన మిత్రులు వుండటంవల్ల బయల్దేరే ముందుగానే వాళ్లకు విషయం చెప్పాను. వార్డులోకి చేరేసరికి డాక్టర్లు చూస్తున్నారు. 'హార్ట్ స్ట్రోక్' వచ్చిందని ప్రెస్ క్లబ్ మిత్రులు, నేను కూడా అనుకున్నాం.

నాన్న ఎమర్జెన్సీ వార్డులో బెడ్ మీద పడుకున్నారు. నర్సులు, డ్యూటీ డాక్టర్లూ ఎటెండ్ అవుతున్నారు. 'ఏమైంది?" అని అడిగితే వాళ్లు ఏమీ చెప్పటంలేదు. నేను అప్పటికప్పుడే ఎం.ఎల్.ఏ. కాలనీలో వుంటున్న మా అన్నయ్య సారధికి ఫోన్ చేసి జరిగిన సంగతి చెప్పాను. తర్వాత నా భార్యకి కూడా ఫోన్ చేసి చెప్పి “అమ్మని కంగారు పడద్దని చెప్పమన్నాను. వెంటనే తనను కూడా తీసుకురమ్మన్నాను.

రాత్రి పదిగంటలయింది. అమ్మ, నాభార్య, అన్నయ్య– ముగ్గురూ ఎమర్జెన్సీ వార్డుకి చేరుకున్నారు. అప్పటికి డాక్టర్లు ఇంకా పరీక్షలు చేస్తూనే వున్నారు. ఏమైందో మాత్రం చెప్పటంలేదు. ఓ పావుగంట తర్వాత 'హార్ట్ ఎటాక్' రాలేదని మాత్రం తేల్చేశారు.

న్యూరోసర్జన్ డా ॥ వంశీమోహన్ అప్పటికి ఏదో సర్జరీలో వున్న కారణంచేత ఆయన కొంత ఆలస్యంగా వచ్చారు. బ్రెయిన్ ఎం.ఆర్.ఐ. తోపాటు స్కానింగు వగైరాలు చేస్తున్నట్లు మాకు అనిపించింది.

రాత్రి పన్నెండు గంటలవుతుండగా డా ॥ వంశీమోహన్ గారు మా దగ్గరకు వచ్చారు. “బ్రెయిన్ లో చిన్న' రప్చర్'అయింది. బ్రెయిన్ హెమరేజ్ ఆసుకోవచ్చు. అందుకే' కొలాప్స్' అయ్యారు" అని ఆయన చెప్పారు.

అయితే ఈ విషయాలన్నీ నాన్నకి చెప్పలేదు. “టెస్టులు చేస్తున్నారు. సీరియస్ కాదు. 48 గంటలు అబ్జర్వేషన్లో పెడుతున్నారు. రేపు కూడా మరికొన్ని టెస్టులు చేస్తారు" అని నాన్నకి చెప్పాం. ఆయనకు మేం చెప్పింది అర్థం అయిందోలేదో మాకు తెలీదు.

అర్ధరాత్రి దాటే సమయానికి ఆస్పత్రిలో ఇన్ పేషంటుగా చేర్చుకున్నారు. నేనూ రామలక్ష్మి, ఆ రాత్రి ఆస్పత్రిలోనే వుండిపోయాం. అమ్మ, తేజా ఇంటికెళ్లిపోయారు.

మర్నాడు, అంటే సెప్టెంబర్ 1 వ తేదీ ఉదయం పదిగంటలకి, నన్నూ, మా అన్నయ్యనీ డాక్టర్ వంశీమోహన్, డాక్టర్ రవివర్మగార్లు లోపలకు పిలిచారు. మానాన్న పరిస్థితిని వివరించారు. "బ్రెయిన్ లో జరిగిన 'రప్చర్'కి రక్తస్రావం జరిగింది. దీన్ని 'రప్చర్డ్ బ్రెయిన్ ఎన్యురిజం' అంటారు. అంటే బ్రెయిన్‌లోని నరం మీద ఒక బుడిపెలాంటిది పగిలి రక్తం చిమ్మటం!

ఈ 'ఎన్యురిజం'కి రెండు రకాలుగా ప్రొసీజర్స్ చెయ్యచ్చన్నారు. మొదటి రకాన్ని 'కోయిలింగ్'అంటారు. అంటే

'హార్ట్'కి స్టంట్ వేసినట్టుగా మెదడుకి కూడా తొడలోంచి కోయిల్ ని మెడ ద్వారా మెదడుకి పంపిస్తారు. ఇది రిస్కులేని పద్ధతి. కానీ తొమ్మిది లక్షలవుతుందని తెలియజేశారు. "ఇక రెండవరకం" క్లిప్పింగ్! మెదడు ఓపెన్ చేసి 'రప్చర్' అయినచోట క్లిప్పులతో మూసేస్తారు. కానీ మెదడు ఓపెన్ చేయటం రిస్క్'తో 'కూడిన వ్యవహారం. దీనికైతే సుమారు ఆరులక్షలు ఖర్చవుతుంది" అన్నారు. “ఏదైనా ఈరోజే చెయ్యాలి” అన్నారు డాక్టర్ గారు.

నేనూ మా అన్నయ్యా మరో ఆలోచనా, మాటా లేకుండా కోయిలింగ్ నే చేయమని చెప్పాం. ఇద్దరం కలిసి నాలుగు లక్షలు అడ్వాన్సు ఇచ్చేశాం! ఇక్కడ ఓ విషయం చెప్పాలి.

మా నాన్న కేంద్ర ప్రభుత్వోద్యోగి (ఆకాశవాణి) కనుక మేం ఇచ్చిన అడ్వాన్సు మొత్తాన్ని త్వరలోనే తిరిగి తీసుకునే అవకాశం వుంటుందని, మా ఫ్యామిలీ డాక్టర్ గారైన డా వెంకటేశ్వరరావు గారు చెప్పారు. అలాగే మూడునెలల తర్వాత ఆ డబ్బు తిరిగొచ్చింది.

ఆరోజు (1 వ తేదీ) సాయంత్రం అయిదు గంటలకు ఆపరేషన్ జరుగుతుందనే సంగతి మా బంధుమిత్రులందరికీ తెలిసిపోయింది. అలాగే అమెరికాలో వుంటున్న నా తమ్ముడు వేణుకి కూడా ఫోన్ చేసి చెప్పేసరికి తను బయలుదేరుతున్నట్టు చెప్పాడు.

ఆపరేషన్ థియేటర్ లోకి తీసుకెళ్ళే ముందు నాచేతా, మా అమ్మచేతా డాక్టర్లు చాలా అప్లికేషన్లమీద సంతకాలు పెట్టించుకున్నారు. ఆపరేషన్ కి ముందే చాలామంది మా చుట్టాలు వచ్చి చూసి వెళ్ళారు.

ఈ 'కోయిలింగ్' ఆపరేషన్ పద్ధతి మొదలై ఆరేడేళ్ళయిందనీ, రేడియోలజిస్ట్

డా . రవివర్మ అనే ఆయన ఆసియా ఖండంలోనే 'నంబర్ వన్' అనీ డాక్టర్లు చెప్పారు.

సాయంత్రం 5 గంటలకు ఐ.సి.యు.నుంచి నాన్నని స్ట్రెచర్ మీద వుంచి ఆపరేషన్ థియేటర్ కి తీసుకెడుతుంటే "జరుగుతున్నది చిన్న ఆపరేషన్ అనీ'స్టంటు'లాంటి దాన్ని లోపలకు పంపుతారనీ, ఓ గంటలో అయిపోతుందని, కాగానే ఇంటికి వెళ్లిపోవచ్చుననీ" నాన్నకి ధైర్యం చెప్పాం.

రాత్రి ఎనిమిదయింది! లోపల నుంచి సర్సులు, అటెండర్లు, జూనియర్ డాక్టర్లూ బయటకు రావటం, లోపలకు వెళ్ళటం జరుగుతోంది. మేం ఏం అడిగినా 'ఆపరేషన్ జరుగుతోంది' అని మాత్రం చెప్తున్నారు. రెండు మూడు గంటల్లో ఆపరేషన్ పూర్తవుతుందని ముందు చెప్పారు. కానీ మూడు గంటలు దాటిపోయినా నాన్నని వార్డుకి తీసుకురాకపోవటంతో మాకు టెన్షన్ ప్రారంభమయింది.

మా అన్నయ్య అయితే మరీ కంగారుపడ్డాడు. ఇక అమ్మ ఆందోళన గురించి చెప్పనే అవసరంలేదు. అలా మరో రెండు గంటలు గడిచాయి రాత్రి. పన్నెండుగంటలవుతుండగా డాక్టర్లు బయటకు వచ్చారు. నేనూ అన్నయ్యా వున్నచోటుకి వాళ్లు వచ్చారు. వారిలో వున్న డాక్టర్ రవివర్మగారు "అయాం సారీ అండీ!' అన్నారు.

అంతే! నా కళ్లనుంచి నీళ్లు కారటం ప్రారంభమైంది. అన్నయ్య కూడా 'షాక్' అయ్యాడు.

ఈలోగా డా . రవివర్మగారు చెప్పారు. "ప్రొసీజర్ ఫెయిలయ్యింది" అని!

అంతే! "అంతా అయిపోయింది' అనుకున్నాం. మానోట మాట రాలేదు.

"కోయిలింగ్ సక్సెస్ అవలేదండీ! మెడలో సరాలు సహకరించలేదు. తొడలోంచి వెళ్లిన' కాయిల్స్ 'మెడ దగ్గరే ఆగిపోతున్నాయి. బ్రెయిన్ లోకి వెళ్లటం లేదు. చాలా ట్రై చేశాం.' ఓల్డ్ ఏజ్ వల్ల వీలుకాలేదు. వియ్ ఆర్ వెరీసారీ! పేషంట్ కండిషన్ ముందు ఎలా వుందో, ఇప్పుడూ అలాగే వుంది. ఇక ఒక్కటే మార్గం. బ్రెయిన్ ఆపరేట్ చేసి క్లిప్పు పెట్టాలి. దానికి డా . శివారెడ్డిగారు కావాలి. ఆయన ఊళ్లో లేరు. మూడోతేదీ ఉదయం వస్తారు. డోంట్ వర్రీ! "అని చెప్పేసి రవివర్మగారు వెళ్లిపోయారు.

నేనూ అన్నయ్యా ఇంకా షాక్ లోనే వుండిపోయాం. ఆయన ఏం చెప్పారో, ఏం జరుగుతోందో మాకు అర్థం కాలేదు.

మా ముందునుంచి, నాన్న పడుకుని వున్న (స్ట్రెచర్ మళ్ళీ ఐ.సి.యూ.కి వెళ్ళింది. అయితే డాక్టర్లు ఆ సమయంలో' ఆనస్తీషియా'అంటూ ఏవేవో మాట్లాడుకోవడం మా చెవిన పడింది. ఆసస్తీషియా ఆపరేషన్ కి ముందు ఇచ్చి వుంటారు. దాని ప్రభావం కొంతసేపు ఉంటుంది. మరి ఆ మత్తు దిగిపోతుందా? దిగిపోతే మళ్ళీ ఇవ్వాలా? ఇలాంటి ప్రశ్నలతో

మా బుర్రలు వేడెక్కాయి. ఆ రాత్రి మా అన్నయ్య, నా తమ్ముడి బావమరిది రాజా ఆస్పత్రిలోనే వుండిపోయారు. అమెరికా నుంచి నా తమ్ముడు వేణు బయల్దేరినట్టు కబురందింది.

2 వ తేదీ ఉదయం పదిగంటల సమయం!

మా బంధువులందరి దగ్గరి నుంచీ ఒకటే ఫోన్లు." నాన్నకి ఎలా వుంది? ఆపరేషన్ జరిగిందా? "అందరూ వాకబు చేయటం .. వాళ్ళందరితోటీ అంతకుముందు రాత్రి జరిగిన సంగతి అంతా మేము చెప్పటం .. నా స్నేహితులు .. అన్నయ్య స్నేహితులు .. నాన్న స్నేహితులు .. వందలమంది ..

నేనూ, అన్నయ్యా డా . వంశీమోహన్ గార్ని కలిసి' నెక్స్ట్ ఏమిటి 'అని అడిగాం.

"డా . శివారెడ్డిగారు వస్తారు. ఏం జరగాలో ఆయనే చెప్పాలి" అని ఆయన సమాధానం.

డా . శివారెడ్డిగారు 3 వ తేదీ సోమవారం వస్తారు. అంతవరకూ మేమందరం ఆ మూడో తారీఖు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తూ క్షణం ఒక యుగంలా గడిపాం. ఎందుకంటే ఆ రోజంతా నాన్న మత్తులోనే వున్నారు. డాక్టర్లు కూడా "పేషంట్ ఆనస్తీషియాలోనే కంటిన్యూ కావాలి "అని చెప్పారు. మేం చాలా టెన్షన్ పడ్డాం! ఎందుకంటే ఒకటో తేదీ సాయంత్రం నుంచి మూడవ తేదీ సాయంత్రం వరకూ అంటే సుమారు 50 గంటలు అనస్తీషియా మత్తులో వుండిపోతే ఏమవుతుందో అనే భయం!

ఆ భయంతోనే 2 వ తేదీ రాత్రి, నేనూ నా భార్యా ఆస్పత్రిలోనే గడిపేశాం. తెల్లవారింది. ఉదయం పదిగంటలవేళ డా . శివారెడ్డిగారు ఇ.సి.యు. తలుపులు తెరుచుకుని లోపలికి వచ్చారు. ఆయనే శివారెడ్డిగారన్న విషయం తెలియగానే, ఆయనకు ఎదురెళ్లి సన్ను నేను పరిచయం చేసుకుని నాన్న గురించి చెప్పాను.

ఆయన నేను చెప్పే మాటలు వింటూనే' షూ'విప్పుకుని, వేరే సాక్స్ వేసుకుని

ఐ.సి.యూ. లోపలకు వెళ్లే గౌను పైన తొడుక్కుని అందమైన, అద్భుతమైన చిరునవ్వు నవ్వుతూ" ఓకే! ఓకే! డోంట్ వర్రీ! డాక్టర్స్ చెప్పారు చూద్దాం! "అని నవ్వుతూనే లోపలకు వెళ్లిపోయారు.

ఆరున్నర సంవత్సరాలు కావస్తున్నా ఆ శివారెడ్డిగారి నవ్వు నాకు ఇప్పటికీ జ్ఞాపకం!

ఓ అరగంటలో లోపలినుంచి ఆయన తిరిగి వచ్చారు. " నాతోరండి! "అంటూ పక్కనేవున్న కన్సల్టింగ్ రూమ్ లోకి తీసుకెళ్ళారు. ఆయన మోములో ఏమాత్రం టెన్షన్ కనిపించలేదు. చాలా ప్లెజంట్ గా కనిపించారు. నాకూ, అన్నయ్యకీ ధైర్యం వచ్చింది.

ఇంతలో ఆయన అన్నారు. " సాయంత్రం ఆపరేషన్ చేద్దాం! ఓపెన్ బ్రెయిన్ సర్జరీ .. క్లిప్పింగ్. ప్రొసీజరంతా కలిపి మూడుగంటల్లో పూర్తవుతుంది .. "

మేము వింటున్నాం .. రెండు నిమిషాలు ఆయన చెప్పటం ఆపి మళ్లీ అన్నారు.

" ఈ క్లిప్పింగ్ ఆపరేషన్ చేస్తే హార్ట్ స్ట్రోక్ రావచ్చు .. పెరాలిసిస్ రావచ్చు. మెమరీ పోవచ్చు ... కంటిచూపు పోయే ప్రమాదం కూడా వుంటుంది. మాట పోవచ్చు. బట్ ఇటీజ్ మస్ట్ "

'మస్ట్' అన్నాక మేం ఏం చేయగలం? దైవం మీద భారం వేసుకున్నాం. అమ్మ మాత్రం చాలా ధైర్యంతో వుందో, బాధతో వుందో మాకు తెలియలేదుకానీ బయటకు మాత్రం చాలా గంభీరంగా వున్నట్టే కనిపించింది. ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని అమ్మకి చెప్తూనే వున్నాం!

సాయంత్రం 5 గంటలయింది. మళ్లీ నాన్నని ఆపరేషన్ థియేటర్ లోకి తీసుకెళ్లారు.

బయట దూరంగా పదిమంది టెన్షన్లో అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు. నేను మాత్రం, శ్రీనగర్ కాలనీలో వున్న సాయిబాబా గుడిలో కూర్చుంటానని చెప్పి వెళ్లిపోయాను. ఆపరేషన్ పూర్తికాగానే నాకు ఫోన్ చేయమని రామలక్ష్మికి చెప్పాను. సుమారు రెండున్నర గంటలు సాయిబాబా విగ్రహం ముందే కూర్చున్నాను.

ఏడున్నరకి ఆపరేషన్ అయిందని నాకు ఫోన్ వచ్చింది. వెంటనే బయల్దేరి ఆస్పత్రికి చేరుకున్నాను. నాన్నని ఐ.సి.యు. లోకి తీసుకొచ్చేసరికి ఎనిమిదయింది. వెంటనే వెళ్లి శివారెడ్డిగార్ని కలిసాను.

నాతోనే వచ్చిన నా అన్నయ్య ఆయన్ని చూడగానే "ఆపరేషన్ సక్సెస్సా సార్?" అంటూ ఎంతో కంగారుగా అడిగాడు.

"ఆపరేషన్ సక్సెస్ అంటూ ఏమీ ఉండదు. మా ప్రొసీజర్ సక్సెస్ అయింది. పేషంట్ ఓ గంట తర్వాత' కాంషన్ లోకి వస్తారు "అని చెప్పారాయన.

" బాగానే వున్నారుగా? "వెంటనే మళ్ళీ అడిగాడు అన్నయ్య.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments